# అనుపమ



గోవిందబాబు
సీతాదేవి

“అనూ...”

"ఎవరూ?" అంటూ ఆ ఇంటి యజమాని ఆంజనేయులుగారు ఆ యువకుడి దగ్గరగా అతన్ని నఖశిఖపర్యంతం పరీక్షిస్తూ చూశారు. అతను అదేం గమనించకుండా "అనుపమా..." మళ్ళీ అదే పిలుపు.

గజ్జల పాంజేబుల చిరు శబ్దానికి వెనక్కి తిరిగారు ఆంజనేయులుగారు.

'విజయ్' అంటూ పరిగెత్తుకుంటూ వచ్చి అతని చేతుల్లో వాలిపోయింది చిన్నకోడలు అనుపమ.

"అ...ను...ప...మా" అంటూ అతను, ఆమె తలను ఆప్యాయంగా నిమిరి వీపు తట్టాడు.

"భయ్యా... తిరిగి... వచ్చావా? ఇది నిజమేనా? నిజంగా... నిజమేనా?..." అంటూ సంతోషంతో వుక్కిరిబిక్కిరయిపోతూ చుట్టూవున్న ప్రపంచాన్నే మరిచిపోయింది అనుపమ.

''అనూ... నీకోసమే...వొచ్చాను తల్లీ! నిన్ను చూడాలనే వచ్చేశాను...'' అతను సర్వం మరిచి యేదేదో చెప్పటోతూనే వున్నాడు.

అప్పటికే ఆ హాలులో ఇంటి పరిచారికలూ, ఇంటి ఇల్లాలు జగదాంబా, పెద్ద కొడుకు శేషగిరీ, కోడలు మీనాక్షీ విచిత్రంగా ఈ దృశ్యాన్ని చూస్తున్నారన్న సంగతి ఆ యిద్దరూ గమనించలేదు. ఆంజనేయులుగారు క్షణంలో తెప్పరిల్లి "అనుపమా! లోపలికి వెళ్ళు... అతని సంగతి మేము చూస్తాం ఈ( ..'' అంటున్న మామగారి గొంతుకి ఈ ప్రపంచంలోకి వచ్చిం'. తనచుట్టూ వున్న పది జతల కళ్ళనీ తప్పించుకుని మెల్లగా లోపలికి వెళ్ళిపోయింది. ఆ ఇంటి ఆచార వ్యవహారాల చాలారోజులుగా చూస్తూనేవుంది – అనుపమ.


భర్త అస్వతంత్రతా, అత్తగారి అధికారం, మామగారి నిరంకుశత్వం, ఆ ఇంట్లో యేది జరగాలన్నా మామగారి ఆజ్ఞానుసారం జరగాలిసిందే. ఆయన పేరంటే ఆ ఇంట్లో అందరికీ సింహస్వప్నం. అనుపమ భర్త గోపాలం, తల్లీదండ్రీ గీచిన గీటు కాస్త కూడా దాటకుండా, వాళ్ళిద్దరికీ ప్రేమపాత్రుడైనాడు. అసలు వచ్చిన యిబ్బందల్లా అనుపమ కాపురానికి వచ్చిన దగ్గరనించీ మొదలైంది.

సిగ్గుతో పమిటకొంగు వంటినిండుగా కప్పుకుని, తన పడకగదిలోకి వచ్చి మంచంమీద వాలిపోయింది అనుపమ. బావగారూ, తోటికోడలూ, నౌకర్లూ తన వైపు గుచ్చిగుచ్చి చూస్తుంటే ప్రాణం చచ్చిపోయింది. ఈ ఇంట్లో తన ప్రతి కదలికా అందరికీ విచిత్రంగానే వుంటుంది. "బంగారు...పంజరం" ఏం సంస్కారం వీళ్ళందరిదీ? యెందుకు అలా చూస్తారు?

నాలుగు సంవత్సరాల తర్వాత విజయ్ వచ్చాడు. మిల్టరీలోకి వెళ్ళిం తర్వాత యెంత మారిపోయాడు... ఈ విజయ్ కోసం తన మనస్సు యెంత విలపిస్తుందీ...

''అనూ'' అనే అత్తగారి గర్జనకి వులిక్కిపడి లేచి నిలబడింది భయంగా అనుపమ. యెదురుగా అపరకాళిలాగా అత్తగారు హుకుం జారీ చేసింది. "జాగ్రత్త ... మేడదిగి ... క్రిందికి రావటానికి ప్రయత్నించకు...''అంటూ వెళ్ళిపోయింది.

"ఇదేమిటి ఆజ్ఞ!" విస్తుపోయిన అనుపమకి కళ్ళనీళ్ళు గిర్రున తిరిగాయి. ఇన్ని సంవత్సరాలకి విజయ్ వస్తే మనస్సు విప్పి ఒక్కమాట మాట్లాడేందుకు వీలులేదూ? మృత్యుముఖంనించి తప్పించుకు వచ్చిన విజయ్‌ని కన్నారా ఒక్కసారి తృప్తిగా చూచుకునేందుకు కూడా నోచుకోలేదా? భగవాన్... యేమిటీ శిక్ష... కన్నీళ్ళతో తలగడా




తడిసిపోయింది. అసహాయురాలు యేం చేయగలదు.

"అమ్మా... కాఫీ'' వంటమనిషి కాఫీ అందించింది. ఆ ఇంట్లో అనుపమను అర్థంచేసుకున్నదీ, సానుభూతి చూపేదీ ఆమె ఒక్కతి మాత్రమే.

అనుపమ దుఃఖాన్ని దిగమింగుకుని... ఆ వచ్చిన ఆయనకి 'కాఫీ' యిచ్చావా? అంది.

"నేను కాఫీ తీసుకెడుతూంటే పెద్దయ్యగారు నా చేతిలో 'ట్రే' ఒక్క తన్ను తన్ని 'నౌకరు వీరన్న కాఫీ తాగే సత్తుగ్లాసులో యివ్వు... తెలుసుగా?' అంటూ వ్యంగ్యంగా నవ్వారు. అమ్మగారూ? అయినా కోడలికి కావలసిన వాళ్ళువస్తే ఇలాగేనా మర్యాద చేసేదీ..." బుగ్గలు నొక్కుకుంది వంటావిడ.

అనుపమ అదేదీ గమనించకుండానే ఆతురతగా ''త్రాగాడా?'' అంది

"లేదు తల్లీ...ఆ కాఫీ ఆమానవుడు ముట్టనేలేదు. మీ మామగారు ఆ అయ్యకి ఆమూల విరిగిపోయిన సామాన్లుపారేసే గదిలేదూ, ఆ గది చూపించి అక్కడ కూర్చోమన్నారమ్మా... యెంత అన్యాయం?" వంటలక్క ఇంకా చెప్పుకుపోతూనేవుంది. అనుపమకి అవేవీ విన్పించటంలేదు. విజయ్ స్నానంచేస్తేగాని కాఫీ తాగడు. అదీకాక అలాంటి గ్లాసుతో రెండోరకంకాఫీ...భగవాన్...

తనేం చేయగలదు. విజయ్ ఈ రావటమే తన పుట్టినింటిలో వుండగావస్తే, తను యెంత హడావుడి చేసేదో... రెండెడ్ల బండీ కట్టించుకుని స్టేషనుకి వెళ్ళి రైల్లోనించి చెయ్యి పట్టుకుని దించి, యెంతో హుషారుగా గిత్తలని పరుగు తీయిస్తూ ఇంటికి వెళ్ళగానే...

అనుపమ వూహాచిత్రం చెదరిపోయింది. వంటలక్క మాటతో "మీ మామగారు ఆయనతో యేదో మాట్లాడుతున్నారు." విజయ్ ఏం కబుర్లు చెప్తున్నాడో...? పాకిస్తాను యుద్ధంలో తను యెంత ప్రమాదంలో చిక్కుకుని బయటపడిందీ... యింకా... ఏం చెప్తూ వుంటాడో... అనుపమ యింక ఆగలేక విజయ్ చెప్పే మాటలైనా దూరంగా వుండి వినవచ్చుననే వుద్దేశ్యంతో యెవ్వరూ తనని చూదటంలేదనే సిర్దారణకి వచ్చి మెల్లగా విజయకి యిచ్చిన గది దగ్గర నిలబడింది.

ఆంజనేయులుగారి గొంతు ఖంగున విన్పిస్తోంది. మీరు స్నానంచేయటానికి నికి ఈ ఇంట్లో సౌకర్యంగా వుండదు. అలా వెడితే కాలవవుంది. హాయిగా స్నానంచేసి రావచ్చు. భోజనంఏర్పాటు నేను చూస్తాను. యెవరిని యెలా సత్కరించాలో మాకు వెన్నతోపెట్టిన విద్య. అంటూ వ్యంగ్యంగా ఇల్లు అదిరిపోయేటట్లు నవ్వాడు ఆయన.

అంతవరకూ ఆయన వెనకనే నిలబడ్డ గోపాలం... మెల్లగా "నాన్నగారూ..." అంటూ ఏదోచెప్పబోతున్న అతన్ని వారించి "అరేయ్ .. ముందు నువ్వు ఇక్కడినించి పో..." అంటూ ఒక్కకసురు కసరటంతో గోపాలం నెమ్మదిగా అక్కడినించి జారుకున్నాడు. విజయ్ ఆత్మాభిమానం యెంత దెబ్బ తినేట్లుగా మర్యాద జరుగుతున్నదో అర్థం చేసుకున్నది అనుపమ. ప్రక్కగదిలోంచి బావగారూ, తోటికోడళ్ళ గుసగుసలు విన్పిస్తూనే వున్నాయి.

"మీ మరదలికి ఆ పీరుడు ఏం కావాలిట." తోటికోడలి గొంతు.

"ఏమో? నీవే అడగలేకపోయావా! చెల్లెలు నీకు ఆ మాత్రం చెప్పరూ? అయినా అన్నయ్య -"

"సిగ్గు లేకపోతే సరి ముఖానికి... తోడబుట్టిన అన్నలకి గతిలేదుగాని, ఈ అన్నగారుమాత్రం వెతుక్కుంటూ వచ్చాడు చెల్లెలిని చూడటానికి. ఏంకాలమండీ... అన్నయ్యలూ, చెల్లెమ్మలూ అని వరసలుపెట్టి పిలవటం ఈరోజుల్లో ఫాషనైపోయింది. ఈ వరసల్లో అందరికళ్ళు కప్పుతూ నాటకం ఆడటం. చూడటానికి మన్మధుడిలాగా వున్నాడు. పాపం! .. పెళ్ళి పెటాకులూలేనట్లుంది. అయినా పెళ్ళి కాకముందు ఎలా ఏడిచినా, ఇలా మొగుడితో కాపరంచేస్తూన్నా కూడా సరాసరి యిక్కడికే వచ్చేస్తాడా? మీ మరదలు ఈ ప్రబుద్ధిడికే కాబోలు

చాటుగుండా వుత్తరాలు రాస్తూ వుంటుంది. యెంత... గుండెలుతీసిన బంటు కాకపోతే ఇంతమంది మనం వున్నా మన్నైనా లేకుండా... అవ్వ... అప్పుడే యిరుగూ పొరుగూ బుగ్గలు నొక్కుకుంటున్నారు. అయినా వెర్రి వాడి పెళ్ళాం వాడకల్లా వదినవి అ గోపాలం చవట గనకనే ఈ రాణీగారి ఆటలు సాగుతున్నాయి. ఇంటికి చెట్టంత పెద్దకొడుకు మీరు... గుడ్లప్పగించి చూస్తూ వూరుకోకపోతే నాలుగు వాయించి వచ్చినదారిన పరిగెత్తేటట్లు చావబాదలేరూ... నా దగ్గర తప్ప మీ ప్రతాపం యెక్కడాచెల్లదు ఛీ...ఛీ... నాకు తల కొట్టేసినట్టుగా వుంది...''

బావగారి మౌనం తోటికోడలి శూలాల్లాటి మాటలూ ఇంక వినలేక గిరుక్కున వెనక్కి తిరిగింది. దుఃఖాన్ని దిగమింగుతూ, వెనక్కి తిరిగిన అనుపమ పై ప్రాణాలు పైనే పోయాయి.

ఎదురుగా అత్తగారు యెంత సేపటి నించీ నిలుచున్నదో? దొంగని పట్టుకున్న పోలీసుగా పళ్ళుకొరుకుతూ

''నీ పిచ్చివేషాలు నా దగ్గర సాగవు. ఆఖరిసారిగా చెప్తున్నాను. వళ్ళు దగ్గరవుంచుకో. నీ మొగుడు వెర్రివెధవైనా మేము మాత్రంకాము ... ఇంకా చిట్టాడిలాగా యిక్కడే నుంచున్నా వేం. ఫో... లోపలకి" అంటూ మీదమీదకి వస్తున్న అత్తగారి ఆకారాన్ని చూసి భయంతోనూ అవమానంతోనూ తల వంచుకుని వచ్చే దుఃఖాన్ని పమిట కొంగు నోట్లో కుక్కుకుని మింగుతూ తనగదిలో వెళ్ళిపడింది అనుపమ.

అతి సున్నితమైన ఆమె హృదయం ఈ అఘాతానికి తట్టుకోలేక రాయిలాగా వుండిపోయింది. విజయ్ యింత హఠాత్తుగా వస్తాడని అనుపమ వూహించలేదు. అలా తెలిస్తే ఈ నరకకూపంలోకి అతను రాకుండా అన్ని విషయాలూ ముందే తెలియచేసేది. అతి దుఃఖాన్ని భరించలేక, పైకి వ్యక్తీకరించలేకా, అంతక్రితం విజయ్ రాసిన వుత్తరాన్ని చదువుకోటానికి దిండుక్రింద కవరుతీసి తెరిచింది. అప్పటికి ఎన్నిసార్లు చదివిందో అనే విషయానికి ఆ నలిగిపోయిన కవరే సాక్షం.

''అనూ

నిన్ను చూసి నాలుగుసంవత్సరాలు గడిచింది. లెక్కప్రకారం ... కాని ... నాకు నలభై సంవత్సరాలుగాఅన్పిస్తోంది. నీ పెళ్ళికి రాలేకపోవటం దురదృష్టం కదూ? కాని...ఒకవిధంగా నా అంత అదృష్టవంతులు ఈ విశాల విశ్వంలో వుండరూ ... వుండబోరూ ... యెందువల్లనో చెప్పమంటావా ... అనూ ... వూ...హూ...నేను నీ దగ్గరకి వచ్చినప్పుడే ఈ విషయం చెప్పటం. సరేగదూ? మిగతా విషయాలు అన్నీ అలా వుంచు...నీ భర్తా అత్తగారూ మామ

గారూ అందరూ నిన్ను చాలా అభిమానిస్తున్నారని రాశావుగదూ? నాకంటే కూడానా?...జవాబు రాస్తావుగా? అన్నింటికీ నీకు కావలసిన విషయం, ఇక్కంమే మందరం యెలా వుంటాం ... వగైరా విషయాలు ఇదిగో రాస్తున్నాను. సరీగా చదువుకో అమ్మాయి ... చీకటి దట్టంగా అలుముకునికన్ను పొడుచుకున్నా కన్పించని రాత్రిసమయంలో మా క్యాంపు నించి మనదేశ సరిహద్దులు కాపలా కాస్తూ.

"అమ్మా ... అన్నం తినండి..." అన్న వంటావిడ పిలుపుకి అనుపమ వులిక్కిపడి చదువుతున్న వుత్తరం దిండు కింద దాచేస్తూ "ఇదేమిటి ... ఇక్కడికెందుకు? ఆశ్చర్యంగాఅన్నది, అన్నంతా చేసి చూపించే అత్తగారి సామర్ధ్యానికి విస్తుపోతూ ... బంగారు పంజరం," గొణుక్కుంది లోపలే అనుపమ,


.................

.................

సంధ్య చీకట్లు నాలుగుమూలలా అలుముకుంటున్నాయి. ఇల్లంతా వెతికినా ఎక్కడా అనుపమ కన్పించక పోవటముతో గోపాలం ఖంగారుగా ఇల్లంతా కలయదిరుగుతూ" అమ్మా...అనూ .. కన్పించటంలేదు " అంటూ బావురుమన్నాడు.

"ఓరి.. చవటా నేను జాగ్రత్తగా చూస్తూ వుండరా అని యెన్నివిధాల చెప్పాను. నీ చవటతనం తగలబడా యెంత మొత్తుకున్నా వినకుండా చాటుకుండా ఆ బ్రాష్టుడు రాసే వుత్తరాలు చేరేసినందుకు అనుభవించు...నీతోపాటు మా పరువూ మర్యాదా, మంటగలిసే రోజు లొచ్చాయి. ఒసే...లచ్చి. ఒరే వెంకన్నా ఎక్కడ చచ్చార్రా అందరూ. అసలు ఆ గదిలో ఆ బ్రాష్టుడు తగలడ్డాడో లేదో చూడండిరా...నాకు తెలుసురా నాయనా, యిది ఎగిరిపోయేదేగాని కాపరం చేసేదికాదని ... పరిగెత్తండిరా యేమండోయ్...యెక్కడున్నారూ... కొంప లంటుకుంటున్నా ఇనప్పెట్టె దగ్గర నించి రారుగదా దేవుడా ... పెళ్ళప్పుడే అంతా చెపితే వినక గంతకి దగిన బొంతలే అని వూరుకుంటే యిప్పుడు ఖర్మ అనుభవించక తప్పదల్లే వుందిరా నాయనా...అయ్యో అయ్యో...ఆ మిల్టరీ వెధవ వచ్చి నప్పటినించీ నా గుండెల్లో గుండెలు లేవు ... నా పరువేం గానూ" జగదాంబ రాగాలతో ఇల్లు దద్దరిల్లిపోయి, ప్రతి ఒక్కరినీ పిలవ నవసరం లేకుండానే పెద్దకోడలూ, కొడుకూ, ఆంజనేయులుగారూ నౌకర్లందరూ గుమిగూడారు. 'ఏమిటేమి టంటూ.'

"నలుగుర్లో యెంత అవమానం అత్తయ్యా రైలు స్టేషనుకీ బస్సుస్టాండుకీ మనుషులని పరిగెత్తించండి," అంటూ మండే అగ్నిలో ఆజ్యం పోసింది పెద్దకోడలు.




ఆంజనేయులుగారు కల్లుతాగిన కోతి లాగా గంతులేస్తూ "చూడండిరా! వెధవల్లారా ఎక్కడ దొరికినా జుట్టుపట్టుకుని ఈడ్చుకురండి దౌర్భాగ్యులని...అయినా ఇంట్లో ఇంతమందివున్నారు తినటానికి. ఏం ప్రయోజనం వుంది. ఆ వెధవ ఎప్పుడు వుడాయించాడో ఒక్కవెధవా చూడాలేదు. నిన్ను జాగ్రత్తరా అని చెప్పానుగదా పెద్దాడా చూడలా" అంటూ పెద్దకొడుకుమీద విరుచుకుపడ్డారు ఆంజనేయులుగారు.

"చూడలేదు నాన్నగారూ. .వుండండి అసలు గదిలోచూద్దాం..." అంటూ దారితీశాడు. అందరూ ఆ వైపు పరిగెత్తారు. యేం చిత్రం కన్పిస్తుందో చూద్దామని.

ఆంజనేయులుగారు అనుమానంలో భార్య నుద్దేశించి "ఏమే అసలు దాని గదిలో దాని నగలూ బట్టలూ వున్నాయో లేదో చూసి చచ్చావా?"

"ఏరా గోపాలం చూశావా?" ప్రశ్నించింది తల్లి.

"అసలు అనూ కన్పించక నే నేడుస్తుంటే ఇవన్నీ ఇప్పు డెందుకమ్మా" అన్నాడు అమాయకంగా.

"అమ్మగారూ ఆ గది తలుపు లోపలేసుంది...యెంత పిల్చినా ఎవ్వరూ పలకటంలా." అంటూ వచ్చి వగురుస్తూ చెప్పింది.

"గాడిద కొడుకుతో కులుకుతూ కూచుందిగా వల్లు! అరేయ్ నా పెద్దకర్ర యిలాతే ఒక్కదెబ్బతో సఫాచేస్తాను."

అగ్గిపోయారు ఆంజనేయులుగారు. గది తలుపుని తన బలం అంతా ఉపయోగించి తన్నుతూ. పెద్దకోడలి సంతోషానికి అంతులేదు. గదితలుపులు విడిపడటం తోటే తోటికోడలు ఎలాంటి పరిస్థితిలో వుందో చూడాలని ముందుగా దూరింది పెద్దకోడలు. అందరూ గదిలోకి అడుగు పెట్టి చూస్తే అంతా కటికచీకటి తప్ప యేమీ కన్పించటంలేదు. క్షణాలమీద నాలుగు లాంతర్లు తెచ్చేశారు గది అంతా వెలుగుతో నిండిపోయింది. చీకట్లోంచి వెలుగులోకి వచ్చిన వాళ్ళలాగా అందరూ కళ్ళు నులుముకుని చూశారు ఒక్కసారి

అనుపమ గుప్పెట్లో నలిగిపోయిన వుత్తరం. రెండవ చేతిలో రహస్యంగా స్టోరు రూంలోంచి దొంగిలించి తెచ్చిన అరిసెముక్కలు రెండు.

"ఎన్నోరోజుల వియోగంతో బాధ పాపం ... ఇప్పటికి కలుసుకుని అలిసి పోయి నిద్రపోతున్నట్లుంది."

అత్తగారి మెప్పు సంపాదించేందుకు ఇదే అవకాశం అని ఒక విసురు విసిరింది పెద్దకోడలు. గోపాలం పిల్లిలాగా యేం జరుగుతుందో అని చూస్తున్నాడు భయంభయంగా.

"అరేయ్...ఆ వుత్తరం ఏమిటిరా... వాడు వుడాయించేశాడు. వెధవ బతికి పోయాడు...లేకుంటే నా ముక్కలూగా నరికి కాకులకీ గద్దలకీ వేసేవాణ్ణి. ఈ ఆంజనేయులు అంటే యేమి టనుకున్నాడో?" అంటూ చేతిలోని కర్రని నేలమీద బాదుతూ విజయ్‌మీద అక్కసు భూదేవిమీద చూపిస్తూ "వురేయ్ పెద్దాడా...ఆ ప్రేమలేఖ కాస్త చదువు... సావధానంగా వినండి అందరూ ... తర్వాత దాని సంగతి చూద్దాం." ఆర్డరు జారీచేశాడు ఆయన.

శేషగిరి ఆత్మ ఘోషించింది. "ఛీ... ఈ అమ్మాయి అలాంటిదికాదు...ఏదో పెద్ద మిష్టరీలాగా వుంది.

"చదవండి చప్పున," మోచేత్తో పొడిచింది భార్య హుషారుగా.

"చదవరా..." తండ్రి గద్దింపులో శేషగిరికి యింక చదవక తప్పలేదు.

"అనుపమా ...

ఎందుకో నాకు, మన చిన్నప్పటి జీవితం గుర్తు వస్తోంది. ఏటివొడ్డున ఇసుకలో పరుగెత్తుతూ ఆడుకున్న ఆటలూ, ఆ దగ్గరలోనే చర్చిలోని పూదారంగు బొగైన్ విల్లాపూలూ, నువ్వు కావాలని సతాయిస్తే "తీసుకువస్తాలే" అని ప్రహారీ యెక్కి లోపలికి వురకటంతో నా కాలు బెణికితే, ఎంత బాధపడ్డావు అనూ! పూలు తీసుకుని వస్తుంటే తోటమాలి వెంటపడితే నువ్వు గమత్తుగా ప్లానువేసి దారి తప్పించటం...గుర్తుందా? బాల్యం యెంత ఆనందంగా గడిచిందీ ...

నాకుమిగిలింది ఈ అనుభూతొక్కటే.

ఏ వుద్యోగమూ అక్కర లేదని మిలటరీలోకి వెడుతుంటే, అమ్మఏడుస్తుంటే నేను ముందుకు అడుగు వెయ్యలేకపోతే ... అప్పటి నీ మాటలు మరిచిపోలేను.

"విజయ్ ... పుట్టిన ప్రతిజీవీ గిట్టక తప్పదు ... కాని ... అదే బ్రతికిన కాసిని రోజులూ దేశంకోసం .. మన మాతృదేశంకోసం పాటుపడుతున్నానన్న సంతృప్తి'' అబ్బ అప్పటి నీ మాటలు తలచుకుంటేనే నా మనస్సు ఆనందంతో గంతులేస్తుంది.

"విజయ్! నిన్ను చూసుకుని నేను యెంత గర్విస్తున్నా ననుకున్నావ్... జన్మ జన్మలకీ యిలాంటి సోదరునే ప్రసాదించు భగవాన్'' అంటుండగానే నీ కళ్లు నీళ్ళతో నిండిపోయినాయి. నేను నీ దగ్గరగా వచ్చి నీ కళ్ళనీళ్ళు తుడుస్తుంటే అమ్మ మన యిద్దరినీ దగ్గరగా తీసుకుని "ఏకగర్భ జనితులు కాకపోయినా ఈ అన్నాచెల్లెళ్ళని చల్లగాచూడు భగవంతుడా'' అనటం నేను మరిచిపోలేను. అమ్మకి నీమీద ఎందుకోఅంత మమకారం? తనచేత్తో నాకు కడసారిగా అన్నంపెడితే యింక నేను తిరిగిరానేమో అనే భయంతో, నీ చేత పెట్టించింది. ఆ పెరుగుముద్దల రుచి నా జీవితంలో మరచిపోలేను అనూ... యివన్నీ నువ్వు మరిచిపోయావా? నేను నమ్మను.

నేను పెళ్ళికి రాలేకపోయినా అన్నీ సవ్యంగా జరిగి నువ్వు అత్తవారింటికి వెళ్ళి సుఖంగా వున్నావంటే యెంతో సంతోషించాను. నీ పెళ్ళికిగాను ఖర్చు చేసిన డబ్బు నేను పంపిందని తెలిసినప్పుడు యెందుకు అంత బాధపడుతూ ఉత్తరం రాశావు? అత్తవారింటిలో వున్న నిన్ను ఒక్కసారి చూచి వెళ్ళిపోదామనే ఆశతో యెంతో ప్రయత్నించి శలవు తీసుకుని వచ్చాను. దురదృష్టవంతుడిని దారిలోనే అన్నీ పోగొట్టుకున్నాను. ప్రయాణంలోని సంఘటన నన్ను కదిలించేస్తోంది. అనూ, నువ్వు విన్నా వినకపోయినా నా భావ పరంపర నీ దగ్గరకే చేరుతుంది.

నువ్వు పెద్ద పెద్ద వుత్తరాలు రాస్తూ వుంటావే... మనదేశం, మన ప్రజలూ అని ... చూడమ్మా మన పక్కవాడే మనలని నిలువుదోపిడీ చేస్తున్నాడు. లంచగొండి తనం పెచ్చుపెరిగి విలయ తాండవం చేస్తోంది. అసలు అవినీతి లేకుండా యెక్కడవుంది! అనూ ఇలాంటి దౌర్భాగ్యులతో నిండిన దేశం కోసం "నా మాతృభూమి" అంటూ గర్వంగా, నాలాంటి లక్షలాది సైనికులు, నల్లులు మాడిపోయినట్లుగా మాడి మసవుతాం. మా ప్రాణాలని తృణప్రాయంగా, ధారపోస్తాం. చెప్పమ్మా ఏదిన్యాయం, "నీ కర్తవ్యం" అంటూ నన్ను హెచ్చరిస్తావు. నేను ఎంతో సంతృప్తిగా నావిధిని నిర్వర్తిస్తూ, నా అప్తులని చూడాలని యెంతో కలలు గంటూ, యెన్నో సంవత్సరాల తర్వాత వస్తుంటే నాకు అనుభవంలోకి వచ్చింది యిది నువ్వు అంటావు" మిట్టరికి వెళ్ళిం తర్వాత ప్రతీకార దృష్టి యెక్కువైంది భయ్యా," అని కాదమ్మా ... మంచీ చెడూ యేకాలంలోనూ వుంటూనే

వుంటుంది. కాని ప్రస్తుతం మన దేశంలో చెడువైపే మొగ్గు కన్పిస్తోంది. ఇలాంటి స్థితిలోనే మనం వుంటే మన దేశానికి అధోగతి తప్పదు అనూ...

మాకు శత్రువు ఒక్కడే... మన దేశం మీదకి దండయాత్ర వచ్చిననాడు మాత్రమే ... మేం ఒకళ్ళని ఒకళ్ళం దోచుకోవాలని ప్రయత్నించం. మా జాతి అంతా ఒక్కటే. అదే భారతజాతి. ఈ భావాలతోనే మా హృదయాలు నిండి వుంటాయి. నా లీవుని రద్దు చేసుకుని వెళ్ళి పోతున్నాను. అక్కడే హాయిగా వుంటుంది. నా ప్రయాణంలో, ప్రతి హృదయంలోనూ మంచీ చెడులను చూశాను. ఒక్క విషయం మాత్రం నీకు తెలియజేయకుండా వుండలేను... అనూ... "అయిదు వందల రూపాయలిస్తే అనుపమని యెవ్వరికీ తెలియకుండా నీతో పంపే ఏర్పాటు చేస్తానని" నీ తోటి కోడలు నాకు కబురు పంపింది... అనూ... పాంటు జేబులోని రివాల్వర్ మీదవున్న నాచెయ్యి గట్టిగా బిగుసుకుంది.

అనుపమా నా ఆవేశాన్ని యెంతో కష్టంమీద అణుచుకున్నాను. ప్రాణాల్ని వొడ్డి విదేశీయుల బారినుంచి దేశాన్ని రక్షించ గలిగాం. దేశమంటే, అక్కా చెల్లెండ్లూ, సోదరులే కాదూ? అనూ! సామూహికంగా దేశాన్ని సంరక్షించ గలిగామనే సంతృప్తి నాకు మిగిలింది... కాని వ్యక్తిగతంగా నీ వేం సుఖపడుతున్నావో? రోజురోజుకూ రాబందుల్లాగా నిన్ను చిత్రహింస చేసే మీ వాళ్ళ నుంచి నిన్ను రక్షించటానికి, నేనూ... నా రెజిమెంటు ... నా రివాల్వరూ యెందుకూ పనికిరావు. నీలాగా యెంత యెంతమంది ఆడపిల్లలు బాధపడుతున్నారో? యెవరికెరుక. నిర్మల హృదయాలకు ప్రాధాన్యం యివ్వక, లింగ భేదాన్నే ఆధారంగా తీసుకొని వున్న వాటికి లేనివి కల్పించి వృధాగా దూషించే దిక్కుమాలిన ప్రజల నేమనాలి:? నిష్కల్మష హృదయాల సంగమం, "పాపం" అంటే అవివేకం కదూ! ఇక శలవు, కలకాలం పసుపు కుంకుమలతో, వర్ధిల్లు చెల్లీ

విజయ్

శేషగిరి వుత్తరం చదవటం పూర్తైంది. ఆంజనేయులుగారి దృష్టి కిటికీలో చల్లారిరిపోయి ఈగలు ముసురుతున్న "కాఫీ" పైనా, విస్తరిలోని యెండిపోయి, చీమలుపట్టిన అన్నం పైన పడింది. పెద్దకోడలు యెప్పుడు బైటికి జారుకుందో యెవ్వరూ చూడలేదు. అప్పుడే స్పృహలోకి వస్తున్న అనుపమకి మామగారి దీర్ఘమైన నిట్టూర్పూ, భర్త తనని రెండు చేతులతోనూ యెత్తుకుని తన రూములోకి వెళ్ళటం మసగ, మసగ్గా కన్పిస్తున్నట్లుగా అయింది. తన భర్తలో అంత ధైర్యం వుందా? అనే విషయం చాలా సేపటి వరకూ అనుపమకి నమ్మకం కలగలేదు.

—